
ఆంధ్రజ్యోతి



జయశంకర్ భూపాలపల్లి
5
ములుగు
శుక్రవారం 26 జనవరి 2024

రిపబ్లిక్ డేకు రెడీ



గణతంత్ర వేడుకలకు సిద్ధమైన అంబేద్కర్ స్టేడియం



ముస్తాబైన ప్రధాన వేదిక

భూపాలపల్లిలో కార్యక్రమాలు ఇలా..

- ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ
- 9.05 గంటలకు పోలీసుల కవాతు, అనంతరం గౌరవ వందనం స్వీకరణ
- 9.20 గంటలకు కలెక్టర్ ప్రసంగం
- 9.30 గంటలకు గౌరవ వందన ముగింపు
- 9.35 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం
- 9.45 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు
- 10.15 గంటలకు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానం
- 11 గంటలకు వేడుక ముగింపు

- భూపాలపల్లి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి
- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న కలెక్టర్ భవేష్ మిశ్రా
- ఉత్తమ ఉద్యోగులకు ప్రసంసా పత్రాల ప్రదానం

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 25: గణతంత్ర వేడుకలకు జిల్లా ముస్తాబైంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల కార్యాలయాల్లో శుక్రవారం ఈ సంబరాలు జరగనున్నాయి. జిల్లా కేంద్రంలో అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకకు అంబేద్కర్ స్టేడియం వేదిక కానుంది. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజల సౌకర్యార్థం టెంట్లు ఏర్పాటు చేశారు. తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నారు. ఈ వేడుకల్లో జాతీయ జెండాను కలెక్టర్ భవేష్ మిశ్రా ఆవిష్కరించనున్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను ప్రశంసా పత్రాలతో సన్మానించనున్నారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులను ఈ సందర్భంగా సత్కరించనున్నారు.



గణతంత్ర వేడుకకు సిద్ధమవుతున్న ములుగులోని తంగేడు గ్రౌండ్

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

- తంగేడు గ్రౌండ్‌లో కార్యక్రమం
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానం

ములుగు కలెక్టరేట్, జనవరి 25: గణతంత్ర వేడుకల కోసం జిల్లా అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేసింది. జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డులో ఉన్న తంగేడు గ్రౌండ్‌లో కార్యక్రమం జరగనుంది. ఇందుకు భారీ టెంట్లు, వేదికను ఏర్పాటు చేశారు. అతిథులు, అధికారులు, ప్రజల కోసం గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తంగేడు గ్రౌండ్‌లో ఏర్పాట్లను జిల్లా అధికారులు గురువారం పరిశీలించారు.

జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం 8.50 గంటలకు గణతంత్ర వేడుక ప్రారంభమవుతుంది. 9గంటలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. 9.10 నుంచి 9.20 వరకు పోలీసుల మార్చ్‌పాస్ట్, పరేడ్ జరుగుతుంది. అనంతరం కలెక్టర్ జిల్లా ప్రజలను ద్దేశించి ప్రసంగిస్తారు. స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. 9.45 నుంచి 10.45 గంటల వరకు విద్యార్థులు, కళాకారు లతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానోత్సవం చేస్తారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

మేడారంలో ముమ్మరంగా ఆర్‌డబ్ల్యూఎస్ పనులు

14.5 కోట్లతో భక్తులకు సౌకర్యాల కల్పన



మేడారంలో నిర్మిస్తున్న తాత్కాలిక మరుగుదొడ్లు

మేడారం, జనవరి 25 : సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు తరలి వచ్చే భక్తులకు మేడారంలో సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 75 కోట్లు మంజూరు చేసింది. పనుల బాధ్యతలను వివిధ శాఖలకు కేటాయించింది. ఇందులో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ రూ. 14.5 కోట్లతో ఆయా పనులు చేపడుతోంది. 5,600 తాత్కాలిక మరుగుదొడ్లు, జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడికతీత, 42 మోటార్ల ద్వారా 14 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏడు వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా చేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ ట్యాంకుల నుంచి పార్కింగ్, అడవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 555 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌కు నీటిని సరఫరా చేసి భక్తులకు అందించనున్నారు. 15కిలో మీటర్ల పైప్‌లైన్లు, 400 చేతి పంపుల మరమ్మతులు చేపడుతున్నారు. బోరు బావుల ఎయిర్ ప్రెసింగ్, ఊట బావుల ప్రెసింగ్, తాత్కాలిక మురుగుదొడ్లకు నీటి సరఫరా, క్యూలైన్ల వద్ద తాగునీటి సౌకర్యం, నీటి శుద్ధీకరణ పనులు సాగుతున్నాయి. అలాగే మేడారంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల వసతిని ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. దీంతో పనులు వేగవంతమై 70శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

రోజుకు 50 లక్షల లీటర్ల తాగునీరు

మేడారం మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరగనుంది. సుమారు కోటిన్నర మంది భక్తులు రానున్నట్లు అధికారులు అంచానాలు వేశారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేసి సౌకర్యాలు కల్పిస్తున్నారు. భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పనులు చేపడుతోంది. ఊరట్టం వద్ద 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, ఊరట్టం క్రాస్ వద్ద 4 లక్షల లీటర్లు, పగిడిద్దరాజు షెడ్ వద్ద 2 లక్షల లీటర్లు, హరిత హోటల్ వద్ద లక్ష లీటర్లు, గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం పాఠశాల వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు వాటర్ ట్యాంకులు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద 2 లక్షల లీటర్ల ట్యాంకు, గద్దెల ఎదుట అతిథి భవనాల వద్ద 50వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటికి భగీరథ, జంపన్నవాగు ఊట బావుల నుంచి మోటార్ ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు. క్యూలైన్లు, జంపన్నవాగు నుంచి గద్దెల వరకు రహదారి మీదుగా, మేడారం, రెడ్డిగూడెం, కొత్తూ రు, ఊరట్టం, కన్నెపల్లి పరిసర గ్రామాల్లో భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బీవోటీలకు నీటిని పంపిణీ చేయనున్నారు. రోజుకు 50లక్షల లీటర్లకు పైగా తాగు నీరు భక్తులకు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సకాలంలో అందుబాటులో ఉంచుతాం

కె.మల్లేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

మహాజాతరలో భక్తులకు సౌకర్యాలను సకాలంలో అందుబాటులో ఉంచుతాం. మా శాఖ ద్వారా తాగునీరు సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, చేతిపంపుల మరమ్మతులు తదితర పనులు చేపడుతున్నాం. అవి చివరి దశకు చేరుకున్నాయి. ఈనెల 31లోగా పూర్తి చేస్తాం. ముందస్తుగా వస్తున్న భక్తులకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.



బోరుబావులను ఎయిర్ ప్రెసింగ్ చేస్తున్న సిబ్బంది

'దళితబంధు' నిధులు విడుదల చేయాలి

ములుగులో నిరసన దీక్ష



ములుగులో నిరసన దీక్షలో పాల్గొన్న బీఆర్ఎస్, దళిత, ప్రజాసంఘాల ప్రతినిధులు

ములుగు, జనవరి 25: దళితబంధు పథకం రెండో విడత నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో గురువారం ఆందోళనకు దిగారు. జిల్లాలో ఎంపికైన 1,100 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ అనుబంధ దళిత సంఘాలు, దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన దీక్ష చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో దళిత బంధు లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, కొత్త ప్రభుత్వం వెంటనే వారికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12 లక్షల సాయం అందించాలన్నారు. దళితబంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కోగిల మహేష్ మాట్లాడుతూ శాంతియుత మార్గం ద్వారానే దళితబంధును సాధించుకుంటామని, మంత్రి సీతక్క సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, ప్రజా సంఘాల నాయకులు పోరిక గోవింద్‌నాయక్, రత్నం రాజేందర్, ముంజాల భిక్షపతి, పల్ల బుచ్చయ్య, కర్రి శ్యాంబాబు, చిన్ని కృష్ణ, చంటి భద్రయ్య, మడికొండ రమేష్, రవీందర్, గట్టయ్య, రాంబాబు, ఓంకార్, భూపాలపల్లి జిల్లా దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు సంపత్, పినపాక, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, జిల్లాల దళితబంధు సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

కాపర్ చోరీ కేసులో ఐదుగురి అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మహదేవపూర్, జనవరి 25: వ్యవసాయ భూముల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్‌ను దొంగలిస్తున్న కేసులో ఐదుగురిని మహదేవపూర్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం గూడూరు గ్రామానికి చెందిన దుర్గం బాలరాజు, దుర్గం రాజబాబు, భూపాల పల్లికి చెందిన రావుల అనిల్, భూపాలపల్లి మండలం జంగేడుకు చెందిన చీమల ప్రవీణ్, మహదేవపూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన గోమాస దేవరాజు ముఠాగా ఏర్పడి జిల్లాలోని వివిధ ప్రాంతాల వ్యవసాయ భూముల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ (రాగి) వైర్లను దొంగలిస్తున్నారు. ఆచూకీ కనుగొన్న మహదేవపూర్ పోలీసు లు వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 58 కిలోల కాపర్ వైరుతోపాటు రెండు ఆటోలు, ఒక బైక్, నాలుగు సెల్‌ఫోన్లు, కొన్ని పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో మహదేవపూర్ సీఐ కిరణ్, ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

కడుపు నింపిన కళను బతికిస్తూ..



గడ్డం సమ్మయ్య

- 50 ఏళ్లుగా చిందు యక్షగాన ప్రదర్శనల్లో మేటిగా గడ్డం సమ్మయ్య
- సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక

జనగామ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వారసత్వంగా వచ్చిన కళనే ఆయన నమ్ముకున్నారు. చిన్న తనంలో తండ్రి వెంట నడిచి కడుపు నింపే చిందు యక్షగాన కళామ తల్లి ఒడిలో ఆయన ఒదిగిపోయారు. 16 ఏళ్ల ప్రాయంలోనే వేదికలు ఎక్కి రామాయణ, మహాభారత, భాగవతం, జాంబవ పురాణ కథలను అవలీలగా ప్రదర్శన ఇవ్వడం ప్రారంభించారు. కులవృత్తిగా భావించో, కడుపు నింపుకోవడం కోసమో కాకుండా అంతరించిపోతున్న కళను కాపాడాలనే సంకల్పాన్ని ఆయన తన 16 ఏటనే తీసుకున్నారు. 50 ఏళ్లుగా చిందు యక్షగాన కళన బతికిస్తూ భావితరాలకు అందిస్తున్న జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి చెందిన గడ్డం సమ్మయ్యను పద్మశ్రీ పురస్కారం వరించింది. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పద్మశ్రీ పురస్కారాల జాబితాలో సమ్మయ్యకు చోటు దక్కింది.

ఐదు దశాబ్దాలుగా చిందు యక్షగాన కళను బతికిస్తున్న జనగామ జిల్లాకు చెందిన గడ్డం సమ్మయ్యను 'పద్మశ్రీ' పురస్కారం వరించింది. కళల విభాగంలో ఆయన అందించిన సేవలకు గాను 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన గడ్డయ్య సమ్మయ్య పేద కుటుంబంలో జన్మించారు. అంతరించిపోతున్న చిందు యక్షగాన కళను బతికిస్తూ జాతీయ స్థాయిలో పుట్టిన గడ్డకు గడ్డం సమ్మయ్య పేరు తెచ్చారు. పాలకుర్తి మండలం వల్మిడిలో గడ్డం(చిందుల) రామస్వామి, చండిగాంబ దంపతులకు సమ్మయ్య 1958లో జన్మించారు. ఆ తర్వాత రామస్వామి దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లిలో స్థిరపడ్డారు. ఆరో తరగతి వరకు చదువుకున్న సమ్మయ్య తల్లిదండ్రులతో పాటు తమ కులవృత్తి అయిన చిందు యక్షగాన ప్రదర్శనల్లో పాల్గొనేవారు. 16 ఏళ్ల వయసులో తొలిసారిగా తండ్రితో కలిసి చిన్ని కృష్ణుడి వేషధారణలో కళారంగ ప్రవేశం చేశారు. జాంబవ పురాణం, భాగవతం, రామాయణం వంటి కథలను ప్రదర్శనల రూపంలో చెప్పడమే చిందు యక్షగానం. చిన్ననాటి నుంచి ఈ కళపై మక్కువతో 5 దశాబ్దాలుగా దాదాపుగా 19 వేల ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. సమ్మయ్య లోహితాంకుడు, ప్రహ్లాదుడు, సిరియాలుడు, బాలవద్దిరాజు పాత్రల్లో ఎక్కువగా ప్రదర్శనలు ఇచ్చేవారు. అంతేకాకుండా సత్యహరిశ్చంద్ర, కీచక, కంసుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, దుర్యోధనుడు, రావణబ్రహ్మ పాత్రల్లో అద్భుతంగా ఒదిగిపోతారు. గడ్డం సమ్మయ్యకు వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన ముత్తిలింగం కుమార్తె శ్రీరంజనితో 1983లో వివాహం జరిగింది. సమ్మయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. పెద్దకుమారుడు సోమరాజు చిందు కళలోనే ఉన్నారు.



భీముడి వేషధారణలో గడ్డం సమ్మయ్య

ఓటు అత్యంత శక్తిమంతం

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తిమంతమైందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. 18ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ సమావే శ హాల్‌లో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌లతో కలిసి కలెక్ట ర్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె భారత ఎన్నికల కమిషన్ సీఈవో అందించిన సందేశాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి అధికారును ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల కమిషన్ విధి విధానాల గురించి అందరూ అవగాహ న కలిగి ఉండాలని, వచ్చే ఎన్నికల్లో బీఎల్వోలు బాగా పనిచేయాలని అన్నారు. దేశంలో కులం, మతం, ప్రాంతం, వర్గం, భాష, పేదరికం, ధనికు లు అనే అంతరం లేకుండా అందరికీ సమానంగా ఓటుహక్కును రాజ్యాం గం కల్పించిందన్నారు. భారతదేశ భవిష్యత్తు కచ్చితంగా ఓటరు చేతిలో ఉంటుందని అన్నారు. ఎన్నికల సమయంలో సక్రమంగా ఓటు హక్కును విని యోగించుకోవాలని సూచించారు. ఐటీడీఏ పీవో అంకిత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల కమిషన్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపా రు. అనంతరం కలెక్టర్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్డీవో నాగపద్మజ, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



ములుగులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



ర్యాలీని ప్రారంభిస్తున్న భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లిలో అవగాహన ర్యాలీ

భూపాలపల్లి కలెక్టరేట్ : పద్దెనిమిదేళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జాతీ య ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం అవగా హన ర్యాలీ జరిగింది. దీన్ని అదనపు కలెక్టర్ ప్రారంభించగా మంజూ ర్‌నగర్‌లోని సింగరేణి బంగ్లా ఏరియా నుంచి సమీకృత కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయు ధం లాంటిదన్నారు. కులమత, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన ఓటు హక్కు ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో సక్రమంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనం తరం సీనియర్ ఓటర్లను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సన్మానిం చారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆర్డీవో రమాదేవి, కలెక్టరేట్ ఏవో మహేష్‌బాబు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కేయూ హాస్టల్స్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రజిత

కేయూ క్యాంపస్, జనవరి 25: కాకతీయ యూనివర్సిటీ హాస్టల్స్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రజితను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశా రు. ఇటీవల ఏసీబీ దాడుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏఆర్ క్రిష్ణయ్య వర్సిటీ హాస్టల్స్ ఆఫీస్‌లో పనిచేసేవారు. క్రిష్ణయ్య సస్పెన్షన్ తర్వాత వర్సిటీ హాస్టల్స్ ఆఫీస్‌లో ఏఆర్, సూపరింటెండెంట్‌ను నియమించకపోవడంతో పరిపాలనపరమైన ఇబ్బందులు తలెత్తాయి. దీంతో వర్సిటీ పరిపాలన అధికారులు రజితను నియమించారు.

రాజ్యాంగమే దేశ రక్షణకు కవచం

రాజ్యాంగ సద్భావన ర్యాలీలో ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి

వడ్డెపల్లి, జనవరి 25 : భారత రాజ్యాంగమే దేశ రక్షణకు కవచమని వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి అన్నారు. ఓటర్ల దినోత్సవం, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ మాల మహానాడు, వివిధ కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ ములుగురోడ్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వరకు భారత రాజ్యాంగ సద్భావన ర్యాలీని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి ర్యాలీలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే భారతదేశం అత్యంత పెద్ద ప్రజాస్వామిక దేశమని అన్నారు. మన దేశానికి రాజ్యాంగం అవసరమైనప్పుడు దేశంలో మేధావిగా ఉన్న అంబేద్కర్ రాజ్యాంగాన్ని తన భుజస్కంధాలపై వేసుకొని ప్రజాస్వామ్యదేశానికి రాజ్యాంగాన్ని అందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. రాజ్యాంగంలో అన్ని వర్గాలకు, వ్యవస్థలకు సమానమైన హక్కులు కల్పించారని అన్నారు. గ్రామగ్రామాన రాజ్యాంగంలోని గొప్పతనాన్ని వివరించాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా పొందిన ఓటు హక్కును ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా సమాజంలోని పౌరులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, పొలిట్ బ్యూరో చైర్మన్ అనోదా భాస్కర్, రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి రాములు, బీసీ నాయకులు క్రాంతి, ప్రవీణ్, వెంకన్న, మాల మహానాడు నేతలు అంకేశ్వరపు రాంచందర్‌రావు, బొల్లం రామ్‌కుమార్, నాగరాజు, ఉదయ్, పొనుగంటి లక్ష్మీనారాయణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న హరికోట్ల రవి

కేయూకు ఐసెట్-24 నిర్వహణ

జూన్ 4, 5 తేదీల్లో పరీక్షలు


కేయూ క్యాంపస్, జనవరి 25: 2024-25 ఏడాదికిగాను రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీఎస్ఐసెట్-24 నిర్వహణ బాధ్యతలు ఈ దఫా మళ్లీ కేయూకే దక్కింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రవేశ పరీక్షలకు షెడ్యూల్‌ను ప్రకటించారు. షెడ్యూల్‌లో భాగంగా ఈ దఫా వరంగల్ కాకతీయ యూనివర్సిటీకే టీఎస్ఐసెట్-24 నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి వరుసగా పదిసార్లు కాకతీయ యూనివర్సిటీకే టీఎస్ఐసెట్ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 4, 5 తేదీల్లో టీఎస్ఐసెట్-24 ప్రవేశ పరీక్షల నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి షెడ్యూల్‌ను ప్రకటించింది. కాకతీయ యూనివర్సిటీకే టీఎస్ఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై వర్సిటీ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు.















భర్త వేధింపులు తాళలేక
భార్య ఆత్మహత్య

చిత్రహింసలు పెట్టి చంపారని మృతురాలి బంధువుల ఆందోళన



ప్రవీణ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



స్వరూప (ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 25: భర్త వేధింపులు తాళలేక భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని జల్లి తండాలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే తండాకు చెందిన జర్పుల ప్రవీణ్‌కు ముగ్ధుంపురం తండాకు చెందిన భూక్య మల్లికాం బ- లాక దంపతుల కుమార్తె స్వరూప(40)తో 24 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమారుడు వంశీ, కుమార్తె చందనలున్నారు. కుమారుడు వంశీ 5 నెలల కిందట ప్రేమం వివాహం చేసుకున్నాడు. మృతురాలి భర్త ప్రవీణ్ ప్రతీ రోజు మద్యం తాగి వచ్చి భార్య స్వరూపను తిడుతూ, కొడుతూ వేధించేవాడు. ఈ విషయంలో స్వరూప గతంలో రెండుసార్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం చేసింది. అలాగే కుమారుడు వంశీ ప్రేమ వివాహం విషయంలోనూ భార్య స్వరూపను తరుచూ వేధింపులకు గురిచేస్తున్నాడు. కాగా, బుధవారం సాయంత్రం భర్త ప్రవీణ్ భార్య స్వరూపతో మళ్లీ గొడవ జరిగింది. నానాబూతులు తిడుతూ స్వరూపు తిట్టి కొట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపంతో స్వరూప పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే చుట్టుపక్కలవారు గమనించి చికిత్స నిమిత్తం గమనించి చికిత్స కోసం నర్సంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి మల్లికాంబ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నెక్కొండ సీఐ హతీరాంనాయక్, ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కాగా జర్పుల ప్రవీణ్ తన కూతురు స్వరూపను నిత్యం మద్యం సేవించి వచ్చి వేధింపులకు గురి చేసేవాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. అంతేకాకుండా కూతురు శరీరంపై గాయాలున్నయని అతడిపై చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఎలాంటి గొడవలు కాకుండా స్వరూప అంత్యక్రియలను నిర్వహించారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

వనదేవతలకు కొనసాగుతున్న మొక్కులు

మేడారం, జనవరి 25 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఫిబ్రవరి 21 నుంచి మహాజాతర జరగనుండగా వివిధ ప్రాంతాల నుంచి గురువారం భారీ సంఖ్యలో తరలి వచ్చి ముందస్తుగా తల్లులను దర్శించుకున్నారు. సుమారు లక్షల మంది వనదేవతలకు మొక్కులు సమర్పించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించుకున్నారు. చల్లగా చూడాలని తల్లులను మొక్కుకున్నారు.

ప్రేమ విఫలమై మనస్థాపంతో
యువకుడి ఆత్మహత్య

మృతుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాసి

హనుమకొండ క్రైం, జనవరి 25: క్రిమిసంహారక మందు తాగి చికిత్స పొందుతూ చెక్క శ్రీకాంత్ (26) అనే యువకుడు బుధవారం రాత్రి మృతి చెందాడు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్ కొంతకాలంగా హనుమకొండ పోచమ్మకుంటలో ఉంటూ ములుగురోడ్డులోని అజరా ఆస్పత్రిలో ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్లుగా హనుమకొండలో ఉంటున్న ఓ యువతితో ప్రేమలోపడ్డాడు. సదరు యువతి శ్రీకాంత్ ప్రేమను నిరాకరించి ఇటీవల మరో వ్యక్తితో పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్.. ఈ నెల 20న భద్రకాళి చెరువు సమీపంలోని వెళ్లి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడి వారు చూసి పోలీసులకు ఫోన్ చేయడంతో 108 సహాయంతో అజరా ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు చెక్క సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. తన తమ్ముడి మృతికి ప్రేమేకారణమని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దాడి కేసులో మూడేళ్ల జైలు శిక్ష

నర్సింహులపేట, జనవరి 25: దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తొర్రూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సరిత తీర్పును గురవారం వెల్లడించారు. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. జయపురంలో 2015లో ఇంటి ప్రహరీ విషయంలో నేలకుర్తి మోహన్‌రెడ్డి, నేలకుర్తి బుచ్చిరెడ్డి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో మోహన్‌రెడ్డి పారతో దాడి చేసిన ఘటనలో బుచ్చిరెడ్డి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపి కోర్టుకు సమర్పించిన సాక్షాధారాలను విచారించిన జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సరిత నిందితుడు నేలకుర్తి మోహన్‌రెడ్డికి రూ.2వేలు జరిమానా విధిస్తూ, మూడేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు తెలిపారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన సీఐ సత్యనారాయణ, ఎస్సై సతీష్, కోర్టు కానిస్టేబుల్ డీఎస్పీ వెంకటేశ్వరబాబు అభినందించారు.

దేవాలయాల్లో చోరీకి పాల్పడిన
నిందితుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న దేవుడి వాహన విగ్రహాలతో డీఎస్పీ వెంకటేశ్వరబాబు, పోలీసు అధికారులు

తొర్రూరు, జనవరి 25 : తొర్రూరు డివిజన్ పరిధిలోని మరిపెడ, తొర్రూరు, దంతాలపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరబాబు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. వారు మహబూబాబాద్ జిల్లాలో దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, తొర్రూరు మండలం మాటేడు వేణుగోపాలస్వామి, అమ్మాపురం సీతారామచంద్రస్వామి, మరిపెడ మండలం గుండెపుడిలోని సీతారామస్వామి ఆలయాల్లో దేవుడి విగ్రహాలను ఊరేగింపు సమయంలో చేపట్టే ఉత్సవవిగ్రహాలు, గరుడవాహనం, అశ్వ వాహనం, ఇత్తడి గొడుగు, దివిటీలు దొంగిలించేవారు. నకిరేకల్ మండల కేంద్రానికి చెందిన చింతల పుల్లారావు అనే పాత ఇనుప సామాను కొనుగోలు వ్యక్తికి విక్రయిస్తారు.

మరిపెడ మండలంలోని ఎల్లంపేట శివారు జమ్మికుంట తండాలో ట్రాన్స్‌ఫారం, కాపర్ వైరు కూడా దొంగిలించి విక్రయించగా గుండెపుడి ఆలయ ఆవరణలో దొంగతనం చేసినపుడు పోలీసులు విచారణ చేపట్టగా మహిళలు కూడా ఈ దొంగతనం చేసినట్లు గుర్తించి డివిజన్ పరిధిలోని సీఐల ఆదేశాల మేరకు పోలీసులు టీమ్‌గా ఏర్పడి విచారణ చేపట్టారు. నిందితులు ఉపయోగించిన ఆటో సీసీ కెమెరాలో కనిపించడంతో గురువారం తొర్రూరు ఎస్సై సతీష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజు, ఎడ్ల వెంకటమ్మ, ఎడ్ల పున్నమ్మ, నాగిళ్ల దుర్గ, గోపగాని రాజమ్మ ఆరుగురు చింతల పుల్లారావుతో కలిసి వెళ్తుండడంతో సమాచారం మేరకు పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరి వద్ద నుంచి రూ.60 వేల నగదు, రెండు క్వింటాల ఇత్తడి విగ్రహాలు, కాపర్‌వైరు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు డీఎస్పీ రివార్డులు అందజేశారు. సీఐ లు కరుణాసాగర్, సత్యనారాయణ, ఎస్సైలు సతీష్, తహేర్‌బాబా, జగదీష్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

కమలాపూర్, జనవరి 25: కమలాపూర్ మండలంలోని భీంపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జె.విజయ అనే ఉపాధ్యాయురాలిని గురువారం విధుల నుంచి సస్పెండ్ చేశామని మండల విద్యాధికారి రాంకిషన్‌రాజు తెలిపారు. విధుల పట్ల ఉపాధ్యాయురాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థులకు సరిగా పాఠాలు చెప్పడంలేదని, విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, పాఠశాలలోని తోటి ఉపాధ్యాయులను, ఎస్ఎంసీ చైర్మన్‌ను, సర్పంచ్‌ను, గ్రామస్తులను అసభ్య పదజాలంతో దూషించిందన్నారు. దీంతో ఉపాధ్యాయురాలిపై టీపీటీఎఫ్ నాయకులు, ఎస్ఎంసీ చైర్మన్, గ్రామ సర్పంచ్, పీటీఏలు ఫిర్యాదు చేయడంతో జిల్లా విద్యాధికారి ఎమ్డీ అబ్దుల్‌హై విచారణకు ఆదేశించారని ఆయన తెలిపారు. డీఈవో ఆదేశాల మేరకు ఈనెల 22న పాఠశాలలో విచారణ జరిపామని ఆయన తెలిపారు. విచారణ నివేదికను జిల్లా విద్యాధికారికి సమర్పించడంతో నివేదిక ఆధారంగా ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు.

పుష్‌పుల్ రైలు ఢీకొని
విధుల్లో ఉన్న కీమెన్ మృతి



మృతుడు కీమెన్ రాజు



సంఘటనకు ముందు కీమెన్ రాజు

గిర్మాజీపేట, జనవరి 25 : విధి నిర్వహణలో భాగంగా రైల్వేట్రాక్ చెక్ చేస్తున్న రైల్వే కీమెన్ వల్లెపు రాజు (38) పుష్‌పుల్ రైలు ఢీకొని దుర్మరణం చెందిన విషాద ఘటన గురువారం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ విలేఖరులకు తెలిపిన ప్రకారం ఈ సంఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ రైల్వేస్టేషన్‌లోని సీనియర్ సెక్షన్ ఇంజనీయర్ 3వ యూనిట్‌లో పనిచేస్తున్న కీమెన్ వల్లెపు రాజు రోజు వారి డ్యూటీలో భాగంగా గురువారం ఉదయం డ్యూటీ ఎక్కాడు. విధి నిర్వహణలో భాగంగా రాజు మూడో లైన్ ట్రాక్ చెక్ చేస్తు చింతల్‌పల్లి వైపు ట్రాక్‌పై బయలుదేరాడు. ఉదయం గంటల ప్రాంతంలో వంచనగిరి రైల్వేగేటు సమీపంలో వరంగల్ నుంచి డోర్నకల్ వెళ్తున్న పుష్‌పుల్ రైలు వెనుక నుంచి ఢీ కొట్టింది. పొగమంచు కారణంగా రైలు రాకను ఆలస్యంగా గుర్తించిన రాజు, రైలు హారన్ విని పక్కకు వెళ్లేందుకు కంకర కుప్ప ఎక్కగా జారడంతో రైలు ఢీ కొట్టింది. అదే సమయంలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్న రైల్వే పోర్టర్ కుమారస్వామి మృతుడు తన సోదరుడు రాజుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చాడు. ఎస్సై ఎం.అయిలయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్ తెలిపారు. తండ్రి స్వచ్ఛంద పదవి విరమణ స్థానంలో రాజు కీమెన్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, కూతురు, తల్లిదండ్రులు ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

- మాజీ డీజీపీకి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో అత్యంత కీలకమైన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు కొత్త సారథి వచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరుసగా ప్రశ్నపత్రాల లీకేజీతో అప్రదిష్ఠపాలైన సంస్థకు.. రిటైర్డ్ పోలీస్ బాస్ అధిపతిగా నియమితులయ్యారు. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా.. కమిషన్‌ను ప్రక్షాళన చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అడుగువేసింది. టీఎస్‌పీఎస్సీ పగ్గాలను మాజీ డీజీపీ ముదిరెడ్డి మహేందర్‌రెడ్డికి అప్పగించింది. సభ్యులుగా రిటైర్డ్ ఐఏఎస్ అనితారాజేంద్ర, ఇండియన్ పోస్టల్ సర్వీస్ రిటైర్డ్ అధికారి అమీర్ ఉల్లాఖాన్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ నర్రి యాదయ్య, విద్యుత్తు శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యరబడి రామ్మోహన్ రావు, కాంగ్రెస్ నాయకురాలు పాల్వాయి రజనీకుమారిని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు గవర్నర్ తమిళిసై గురువారం ఆమోదం తెలిపారు. ఆ వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా, చైర్మన్, సభ్యులు

పదవీ బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి ఆరేళ్ల పాటు లేదా 62 ఏళ్ల వయసు నిండేలోపు పదవుల్లో ఉంటారు. ఈ నిబంధనల్లో ఏది ముందు వర్తిస్తే అది అమలవుతుంది. మరోవైపు ఈ ఆరుగురిలో ఓసీ, బీసీ సామాజికవర్గాలకు చెందినవారు ఇద్దరు ఉండగా, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించారు. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌తో కలిపి మొత్తం 11 మందిని నియమించవచ్చు. ప్రస్తుతం చేపట్టినవి పోగా.. ఇంకా ఐదుగురిని నియమించే అవకాశం ఉంది. వీటిపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

భుజాలపై చాలా పెద్ద బాధ్యత

బీఆర్ఎస్ హయాంలో టీఎస్‌పీఎస్సీ తీవ్ర విమర్శలకు గురైంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం సంస్థ పేరును మసకబార్చింది. నిరుద్యోగుల ఆత్మహత్యల నేపథ్యంలో కమిషన్ దోషిగా నిలవాల్సి వచ్చింది. దీంతో అప్పటి చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులు రాజీనామా చేయాలంటూ విపక్ష నేతలు, ఓయూ విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. అయినా, బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని కొనసాగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. జనార్దనరెడ్డి, నలుగురు సభ్యులు వైదొలగారు. మిగతా ఇద్దరిలో ఒకరు ఇటీవల రాజీనామాను గవర్నర్‌కు పంపారు. మరొకరు ఇంకా వైదొలగలేదు. కాగా, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రకటించారు. కొత్త కమిషన్ ఏర్పాటయ్యాక ఏడాది లోపు 2 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. టీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా, పకడ్బందీగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డితో పాటు సభ్యులపై చాలా పెద్ద బాధ్యత ఉంది.



వ్యవసాయ కుటుంబం..

మహేందర్‌రెడ్డిది ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామం. వ్యవసాయ కుటుంబానికి చెందిన నారాయణరెడ్డి, అచ్చమ్మలకు 1962 డిసెంబరు 3న జన్మించారు. నల్లగొండ జిల్లా సర్వేల్ గురుకులంలో ప్రాథమిక, కూసుమంచిలో హైస్కూల్ విద్యను అభ్యసించారు. నాగార్జున సాగర్ గురుకుల కళాశాలలో ఇంటర్, వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ (ఆర్ఈసీ) నుంచి 1984లో బీటెక్ సివిల్ పూర్తి చేశారు. ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్ చదివారు. 1986లో మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించారు. విశాఖపట్నం, గోదావరిఖని, గుంటూరులో ఏఎస్పీగా, బెల్లంపల్లి అడిషనల్ ఎస్పీగా, నిజామాబాద్, కర్నూలు జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఈస్ట్ జోన్ డీసీపీ, జాతీయ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్, డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలందించారు. 2003-07 మధ్య సైబరాబాద్ కమిషనర్‌గా కొనసాగారు. గ్రేహౌండ్స్, ఇంటిలిజెన్స్ చీఫ్‌గా చేసిన మహేందర్‌రెడ్డి 2014-17 నడుమ హైదరాబాద్ సీపీగా, 2017-22లో డీజీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. పోలీసింగ్‌లో టెక్నాలజీకి పెద్దపీట వేశారు.

విద్యావంతుల ఇంటి నుంచి..



హైదరాబాద్ జూబ్లీ హిల్స్ ఫిల్మ్‌నగర్‌కు చెందిన 58 ఏళ్ల అమీర్ ఉల్లాఖాన్‌ది వీరిది విద్యావంతుల కుటుంబం. 1983 బ్యాచ్ ఇండియన్ పోస్టల్ సర్వీసు అధికారి. 1995లో వీఆర్ఎస్ తీసుకున్నారు. తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ, యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(యూఎన్‌డీపీ)లో పనిచేశారు. ఉర్దూ వర్సిటీ, ఐఎస్‌బీ, నల్సార్, ఎంసీహెచ్ఆర్‌డీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. విద్య, ఆర్థిక రంగాలపై కథనాలు రాశారు.

ఉత్తమ అధికారిగా..



రిటైర్డ్ ఐఏఎస్ అనితారాజేంద్ర ఓయూలో ఎంఏ, ఎల్ఎల్ఎం చదివారు. 1963 ఫిబ్రవరి 4న జన్మించారు. 1998లో సివిల్స్ సాధించారు. 2011-12లో మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా, 2012లో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా, 2013-14లో ఏపీఐడీసీ వీసీ అండ్ ఎండీగా, 2015లో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా, 2015-18లో హోం శాఖ కార్యదర్శిగా, 2018-20లో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా, 2020-22లో పశు సంవర్ధక శాఖ కార్యదర్శిగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రెండుసార్లు అవార్డు పొందారు. అనితా గౌడ వర్గానికి చెందినవారు.

విద్యుత్తు శాఖ నుంచి..



విద్యుత్తు శాఖలోని జల విద్యుత్తు విభాగంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు యరబడి రామ్మోహన్‌రావు. ఎరుకల (ఎస్టీ) సామాజిక వర్గానికి చెందినవారు. 1963లో జన్మించిన ఆయన 1984లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీఈ చదివారు.

సీనియర్ ప్రొఫెసర్..



యాదయ్య 1964 ఫిబ్రవరి 10న జన్మించారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఎలక్ట్రానిక్స్ సీనియర్ ప్రొఫెసర్. 1988లో బీఈ, 1991లో ఎంటెక్, 2000లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2008-12 వరకు జేఎన్‌టీయూలోని ఈఈఈ విభాగం హెచ్‌వోడీగా, 2013-14లో సీఈహెచ్ విభాగం వైస్ ప్రిన్సిపల్‌గా, 2014-15లో ప్రిన్సిపల్‌గా, 2015-19 వరకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఎంసెట్ కన్వీనర్‌గా పనిచేశారు. ఈయన కురుమ వర్గానికి చెందినవారు.

గ్రూప్-1 కొలువు వదిలి..



దళిత వర్గానికి చెందిన రజనీ 1972లో జన్మించారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎల్ఎల్‌బీ, బీఈడీ చదివారు. 2000 సంవత్సరంలో గ్రూప్-1 సాధించారు. 2004 వరకు ఖైరతాబాద్ సర్కిల్ మునిసిపల్ కమిషనర్‌గా పని చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉండగా.. ఆయన ప్రోత్సాహంతో టీడీపీలో చేరారు. ఆ ఏడాది సూర్యాపేటలో, 2014లో తుంగతుర్తి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023 అక్టోబరు 18న రేవంత్‌రెడ్డి పిలుపుతో కాంగ్రెస్‌లో చేరారు.



ఇక.. వేగంగా
పోస్టుల భర్తీ!

- టీఎస్‌పీఎస్సీకి కొత్త రూపుతో ఉద్యోగార్థుల్లో ఆశాభావం
- ప్రభుత్వ చొరవపై హర్షం

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)ను గాడిన పెట్టే అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ పట్ల ఉద్యోగార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్, సభ్యులను నియమించి టీఎస్‌పీఎస్సీకి కొత్త రూపు తీసుకురావడంతో ఇక ఉద్యోగాల భర్తీనే తరువాయి అని ఆశగా ఎదురు చూస్తున్నారు. నిజానికి, గత ప్రభుత్వ హయాంలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2 సహా వివిధ పోస్టులకు పరీక్షలు జరిగాయి. కానీ, పేపర్ లీకేజీలు, పరీక్షకు హాజరైన అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకోకపోవడం తదితర కారణాల వల్ల ఆయా పరీక్షలు రద్దు అయ్యాయి. దీంతో టీఎస్‌పీఎస్సీ అప్రతిష్ఠ మూటకట్టుకోగా ఉద్యోగార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై నిరుద్యోగులకు హామీనిచ్చింది. అధికారం చేపట్టిన వెంటనే బోర్డును ప్రక్షాళన చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై దృష్టి సారించింది. చైర్మన్, సభ్యుల ఎంపిక కోసం అనుభవజ్ఞులు, మేధావులతో ఓ కమిషన్ ఏర్పాటు చేసింది. అలాగే, వివిధ రాష్ట్రాల్లోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరు అధ్యయనానికి ఐఏఎస్ అధికారులను రెండు బృందాలుగా కేరళ, ఢిల్లీ పంపింది. ఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహణపై ప్రత్యేకంగా అధ్యయనం చేయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా యూపీఎస్సీ అధికారులతో స్వయంగా మాట్లాడారు. మొత్తంగా రాజకీయ ప్రమేయం లేకుండా చైర్మన్, సభ్యులను ఎంపిక చేసి జాబితాను గవర్నర్‌కు పంపగా వెంటనే ఆమోదం లభించింది. దీంతో కమిషన్ పూర్తి స్థాయిలో ఏర్పాటైంది. దీంతో ఉద్యోగాల భర్తీ ఇక పారదర్శకంగా జరుగుతుందని ఉద్యోగార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నియామకాల్లో సామాజిక న్యాయం

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకం విషయంలో దాదాపు అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం దక్కింది. చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి ఓపెన్ కేటగిరి, రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అనితా రామచంద్రన్, కుర్మ కులానికి చెందిన నర్రి యాదయ్య, ఎస్టీ (ఎరుకుల) సామాజిక వర్గానికి చెందిన రామ్మోహన్ రావు, ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన గ్రూప్-1 అధికారిగా పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న పాల్వాయి రజని, ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో పని చేసిన అమీరుల్లాఖాన్ (ముస్లిం మైనార్టీ కోటాలో) సభ్యులుగా నియమితులయ్యారు. వీరంతా ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పని చేశారు.

కలెక్టర్ భవేష్ మిశ్రాకు పురస్కారం



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 25: అసెంబ్లీ ఎన్నికలను జిల్లాలో సమర్థంగా నిర్వహించినందుకు గుర్తింపుగా కలెక్టర్ భవేష్ మిశ్రాకు ఉత్తమ పురస్కారం దక్కింది. జాతీయ ఓటరు దినోత్సవం సంద ర్భంగా హైదరాబాద్‌లోని జెన్‌టీయూలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఉత్తమ పురస్కారాన్ని స్వీకరించిన కలెక్టర్‌ను ఎన్నికల సంఘం అధికారులు అభినందిం చారు. జిల్లా అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య సేవల్లో భూపాలపల్లి బెస్ట్

ఉన్నత ప్రమాణాల్లో జిల్లా అగ్రస్థానం • ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ అందుకున్న డీఎంహెచ్‌వో



ఎన్‌క్వాస్ సర్టిఫికెట్‌ను స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 25: వైద్య సేవల్లో జిల్లాకు జాతీయ గుర్తింపు లభించింది. ఉన్నత ప్రమాణాలు పాటించడంలో భూపాలపల్లి మొదటి స్థానంలో ఉంది. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) సర్టిఫికెట్‌ను గురువారం అందుకుంది. జిల్లాలోని కాటారం, మహాముత్తారం, గణపురం, ఆజంనగర్, మొగుళ్లపల్లి పీహెచ్‌సీలతోపాటు చిట్యాల సీహెచ్‌సీ, మీనాజీపేట, ధన్వాడ, బయ్యారం, కనుకనూర్, గిద్దేముత్తారం, గుండ్ల బుద్దారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఎన్‌క్వాస్ ప్రమాణాల్లో మెరుగైన ఫలితాలు సాధించాయి. 87.5 శాతం ప్రమాణాలతో జిల్లా మెరుగైన ఫలితాలు సాధించడంతో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, కమిషనర్ కర్ణన్ చేతుల మీదుగా భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్ ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరించారు. ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన నేపథ్యంలో 12 గంటలు పనిచేసే పీహెచ్‌సీలకు ఏడాదికి రూ.లక్షలు, 24 గంటలు పనిచేసే పీహెచ్‌సీలకు రూ.3లక్షలు, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లకు రూ.1.26 లక్షలు మూడేళ్లపాటు అందనున్నాయి. సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు శ్రీదేవి, కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు అన్వేషిని, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులుగా 29 మంది

నేడు అవార్డులు ప్రదానం

ములుగు కలెక్టరేట్, జనవరి 25: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న 29 మంది ఉద్యోగులను ఉత్తమ సేవకులుగా గుర్తిస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం జరిగే గణతంత్ర వేడుకలలో వీరికి ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు.

రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలో..

అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి.శ్రీజ, తాడ్వాయి తహసీల్దార్ టి.రవీందర్, గోవిందరావుపేట ఎంపీడీవో జె.ప్రవీణ్, కలెక్టరేట్ ఏవో పి.ప్రసాద్, సూపరింటెండెంట్ ఎం.రాజ్ ప్రకాశ్, నాయబ్ తహసీల్దార్ జె.మమత, ఆర్ఐ పి.విజేందర్, డీపీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ డి.రాజేష్

కలెక్టర్ కార్యాలయం

కలెక్టర్ సీసీ కె.క్రాంతికుమార్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్.దేవేందర్, హెచ్‌హెచ్‌పీ పి.రామకృష్ణ, ఐటీ సపోర్టర్ కె.శివ శ్రీసాయిరామ్

ఇంజనీరింగ్ శాఖలలో..

ఇరిగేషన్ డీఈఈ టి.సంతోష్, పీఆర్ ఏఈ డి.అజిత్, ఆర్‌అండ్‌బీ ఏఈ ఆర్.రాకేష్, మిషన్ భగీరథ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.కిరణ్‌కుమార్

పోలీసు శాఖలో..

డీసీఆర్‌బీ ఎస్సై ఎ.కమలాకర్, ఏఎస్సై ఎల్.కుమారస్వామి, కానిస్టేబుళ్లు జి.నాగరాజు, బి.విక్రమ్, ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్ కె.ప్రభాకర్.

వైద్యఆరోగ్య శాఖ .

ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవన్, ల్యాబ్ టెక్నీషియన్ వి.మధుకర్,ములుగు ఏరియా వైద్యశాల రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు టీమ్.

వివిధ శాఖలు

ఎస్టీవో ఎం.ప్రకాశ్‌రెడ్డి, స్టాటస్టికల్ ఆఫీసర్ ఎం.రాజ్‌కుమార్, వెంకటాపూర్ మండల వ్యవసాయాధికారి ఎం.కల్యాణి, డీపీఆర్‌వో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కె.శంకర్, తాడ్వాయి మండలం నార్లాపూర్-2 అంగన్వాడీ టీచర్ వి.అనసూయ

సర్వే పూర్తయితేనే కాఫర్ డ్యాం పనులు



మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో జియోలాజికల్ సర్వే చేస్తున్న సిబ్బంది

మహదేవపూర్ రూరల్, జనవరి 25 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు సంబంధించి కాపర్ డ్యాం పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. అక్టోబరు 20న మేడిగడ్డ బ్యారేజీలోని బ్లాక్-7లో 20పిల్లరు కుంగుబాటుకు గురైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బ్యారేజీ వంతెనపై నుంచి రాకపోకలు నిలిపివేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బ్యారేజీ పునరుద్ధరణకు సంబంధించి కాపర్‌డ్యాం పనులు ప్రారంభ మయ్యాయని చెబుతూ వచ్చాయి. అయితే. నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ మాత్రం ఆ పనులను ఇప్పటికీ పూర్తిస్థాయిలో ప్రారంభించ లేదు. ఈ క్రమంలోనే ప్రభుత్వంతోపాటు ఎల్‌అండ్‌టీ మరో రెండు ప్రైవేటు సంస్థలతో నష్టం అంచనా తెలుసుకునేందుకు సర్వే చేపట్టాయి. ఇందులో ఓ సంస్థ చేపట్టిన సర్వే పూర్తికాగా మరో సంస్థ ఆధ్వర్యంలో జియోలాజికల్ సర్వే కొనసాగుతోంది. ఇది పూర్తి కావడానికి మరో మూడు నుంచి నాలుగు రోజులు పట్టే అవకాశం ఉందని ఆ సంస్థలో పనిచేసే ఓ అధికారి చెప్పారు. కాగా ఈసర్వే పూర్తయ్యాకే పునరుద్ధరణకు సంబంధించి కాపర్ డ్యాం పనులను ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటి వరకు మహారాష్ట్ర వైపు బ్లాక్-8 నుంచి 6 వరకు వెళ్లేందుకు గోదావరిలో అప్రోచ్ రోడ్లను మాత్రమే ప్రభుత్వం నిర్మిస్తోంది. నిర్మాణ సంస్థ నష్టం అంచనా తేలితే తప్ప పునరుద్ధరణ పనులు చేపట్టే అవకాశం లేదని తెలిసింది. బ్యారేజీ కుంగుబాటుకు గురై ఇప్పటికే మూడు నెలలు పూర్తికాగా పునరుద్ధరణకు సంబంధించి సరైన స్పష్టత లేకపోవడంతో బ్యారేజీ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

తూనికలు, కొలతల శాఖ తనిఖీ

కాకతీయఖని, జనవరి 25: పట్టణంలోని పలు దుకాణాలను జిల్లా లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతల శాఖ) ఇన్‌స్పెక్టర్ శ్రీలత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో సంత జరుగుతున్న నేపథ్యంలో చిరువ్యాపారుల వాడుతున్న కాంటాలను పరిశీలించారు. తూకంలో రాళ్లు వాడకుండా ఇనుప పౌండ్ బాట్లను వినియోగించాలని సూచించారు. ముద్రలు వేసిన కాంటాలు, తూకాలను మాత్రమే వాడాలని ఆదేశించారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు చిరు వ్యాపారుల వద్ద తక్కువ బరువు ఉన్న బాట్లను స్వాధీనం చేసుకున్నారు.

గోదావరికి హారతి



కాళేశ్వరంలో గోదావరికి హారతిస్తున్న అర్చకులు

మహదేవపూర్, జనవరి 25: మండలంలోని కాళేశ్వరంలో గురువారం సాయంత్రం గోదావరి హారతి కార్యక్ర మాన్ని నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజు ఇది జరుగుతోంది. గురు వారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీని వాస్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. అర్చకులు, భక్తులు, గ్రామస్థులు మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ గోదావరి వద్దకు వెళ్లి హారతి ఇచ్చారు.


అడవులను సంరక్షించాలి : డీఎఫ్‌వో



గుట్టపై నుంచి అడవి వ్యూను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

కాటారం, జనవరి 25: అడవులు, వన్యప్రాణాల సంరక్షణకు ఫారెస్టు అధికారులు అంకితభావంతో పని చేయాలని డీఎఫ్‌వో వసంత అన్నారు. కాటారం రేంజ్ పరిధిలోని ప్రతాపగిరి బీట్ పరిధిలో ఆమె గురువారం పర్యటించారు. గొంతెమ్మగుట్ట, ప్రతాపగిరిగుట్ట పరిసరాలు, అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక అటవీ అధికారులతో కలిసి గొంతెమ్మగుట్టపైకి ఎక్కి అడవుల వ్యూను పరిశీలించారు. అడవిలో ఉన్న చెట్లు, జంతువుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గొంతెమ్మగుట్ట విశేషాలు, ప్రాశస్త్యాన్ని నాయక్‌పోడ్ సంఘం నాయకులు వివరించారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ఉంటుందన్నారు. వేసవిలో ఎరగడులు పడి అడవి నాశనం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీఎఫ్‌వో వెంట మహదేవపూర్ ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, కాటారం ఇన్‌చార్జి రేంజర్ కిరణ్‌కుమార్, కాటారం, చింతకాని, దామెరకుంట సెక్షన్ అధికారులు అంజయ్య, అర్చన, చంద్రశేఖర్, ప్రతాపగిరి, బొప్పారం ఎఫ్‌బీవోలు మోయిన్, అశోక్, బేస్‌క్యాంప్ సిబ్బంది సంతోష్, రాజు ఉన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



చిట్యాలలో ఓటరు అవగాహన ర్యాలీ

కాటారం, జనవరి 25 :మండ లంలో జాతీయ ఓటరు దినోత్స వాన్ని గురువారం ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వరకు తహసీల్దార్ నాగరాజు, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించిన అనంతరం మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీవో ఉపేం ద్రయ్య, ఏపీవో వెంకన్నతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఒడిపిలవంచ జడ్పీహెచ్ ఎస్‌తోపాటు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు గ్రామ స్థులతో కలిసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు అనే వజ్రాయు ధాన్ని దుర్వినియోగం చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. బీఎల్‌వోలు ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ భాస్కర్, ఆర్ఐ వెంకన్న, హమీద్, విద్యానాథ్, రవిశంకర్, హెచ్‌ఎం గండు రాజబాబు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, కార్యదర్శులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

• వెంకటాపురం(నూగూరు: మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమై అంబేద్కర్, జగదాంబ సెంటర్ల మీదుగా శివాలయం సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఆతదుపరి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ పాయం రమణ, సర్పంచ్ చిడెం యామిలి, తహసీల్దార్ సర్వర్‌పాషా, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, ఎంపీటీసీ కొండపర్తి సీతాదేవి, అంగన్‌వాడీ టీచర్లు అరుణకుమారి, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

• వాజేడు: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీ తీశారు. హనుమాన్ సెంటర్‌లో మానవహారం చేపట్టి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగిం చుకో వాలని సూచించారు ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ, ఎంపీడీవో విజయ, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఆర్ఐ రాజు, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• మొగుళ్లపల్లి: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలకేంద్రంలో జడ్పీహెచ్ ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలకంటి మొగిలయ్య, మేడిపల్లి జయమ్మ అనే వృద్ధులను సన్మానించారు. సర్పంచ్ మోటే ధర్మారావు, తహసీల్దార్ జాడి సునీత, ఎంపీపీ యార సుజాత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్, బీఎల్వోలు సంధ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

•మహదేవపూర్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు నిర్వహించి బస్టాండ్ కూడలిలో ప్రతిజ్ఞ చేశారు.

• చిట్యాల : జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో రామయ్య ఆధ్వర్యంలో ర్యాలీ తీసి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై రమేష్, ఎంఈవో రఘుపతి, సర్పంచ్ పూర్ణచందర్‌రావు, ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ బాస్కర్ల రాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

• ములుగు కలెక్టరేట్ ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఏర్పాటు చేసిన వివిధ సంస్థల్లో ఎన్నికల సంఘం స్వతంత్రమైనదని, శక్తివంతమైనదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కె.రజనీలత, అధ్యాపకులు రమేష్‌చంద్ర, శ్రీకాంత్, వెంకన్న, సమ్మయ్య, మహేందర్, విఎస్.ఉమాదేవి, ఉదయశ్రీ, పి.నాగమణి, శంకర్, విజిత, తేజోలత, శ్రీనివాస్, నవీన్,తదితరులు పాల్గొన్నారు.

• టేకుమట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ మంజుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో అనిత, వివిధ శాఖల అధికారులు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

• మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్లతో పాటు పలు గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. హైస్కూల్లో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఆర్ఐ సరిత తదితరులు పాల్గొన్నారు.

• తాడ్వాయి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రిన్సిపాల్ రాంపాక అవిలయ్య ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణం నుంచి ర్యాలీ తీశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొమ్మాల సంధ్య, అధ్యాపకులు, సిబ్బంది రాములునాయక్, భిక్షం, కిషన్, శ్వేత, రాజ్‌కుమార్, రాజు, అశోక్, శ్రీలత, హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

• మంగపేట : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ ఉద్యోగులు మానవ హారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక తహసీల్దార్ భైరి వీరస్వామి, నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, రెవెన్యూ అధికారులు కుమారస్వామి, ఏసుపాదం, నందాకిషోర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సంఘం అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



ములుగు కలెక్టరేట్, జనవరి 25: ప్రజా ఆరోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం-3194 జిల్లా అడ్‌హాక్ కమిటీ నూతన అధ్యక్షుడిగా వంగేటి వెంకటేశ్వర్లును నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్యాంసుందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్‌రెడ్డిలు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమిటీ కోచైర్మన్‌గా యాకలక్ష్మి, సీతారాం, బి.తిరుపతయ్య, కన్వీనర్‌గా కె.శ్రీనివాస్, కోకన్వీనర్లుగా స్వరూపరాణి, ఉపేంద్ర, కృష్ణ, ట్రెజరర్‌గా జి. వినోద్‌లు వ్యవహరిస్తారని అన్నారు. తనను జిల్లా అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

రామప్పను సందర్శించిన ఇంగ్లండ్ దేశస్థుడు



రామప్పలో ఇంగ్లండ్ దేశస్థుడు

వెంకటాపూర్(రామప్ప), జనవరి 25: మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని గురువారం ఇంగ్లండ్ దేశానికి చెందిన స్టీవ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన తూర్పు ముఖద్వారంలో ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ శిల్పకళా సంపదను కనులారా వీక్షించారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకుని మంత్రముగ్ధులయ్యారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో షికారు చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

గోవిందరావుపేట, జనవరి 25: 75వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పస్రా ఎస్సై షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పస్రాలో వాహన తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారిలో మండల కేంద్రం మీదుగా వచ్చిపోయే వాహనాలను ఆపి సోదా చేశారు. వాహనదారుల పూర్తి వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటను పరిశీలించిన అధికారులు

మల్హర్, జనవరి 25 : మండలంలోని పెద్దతూండ్లలోని వరి పంటలను ఏవో సుధాకర్ గురువారం పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకు ఎకరానికి లమడ సైహాలోత్రిన్ 400 ఎంఎల్, క్లోరొంతనీ ప్రోల్ 60 ఎంఎల్, క్లోరోపైరిసాస్ 50 శాతం ఈసీ 500 ఎంఎల్ లేదా కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కేజీలు వాడాలని సూచించారు.

నేటి నుంచి గొంతెమ్మగుట్ట లక్ష్మీదేవర జాతర



గొంతెమ్మగుట్టపై పాండవుల భేరి

కాటారం, జనవరి 25 :మండలంలోని ప్రతాపగిరి అటవీ ప్రాంతంలో గొంతెమ్మ గుట్టపై లక్ష్మీదేవర జాతర మహోత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. శుక్రవా రంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు ఆదివారంతో ము గియనున్నాయి. భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 30 లక్ష్మీదేవరలు రానున్నాయని జాతర నిర్వాహకులు తెలిపారు. వేలాది మంది భక్తులు జాతరలో పాల్గొని మొక్కులు సమర్పించుకోనున్నారు. మూడు రోజుల పాటు జరిగే జాతరలో మొదటి రోజైన శుక్రవారం మద్రిపల్లి లక్ష్మీదేవరకు కాళేశ్వర త్రివేణి సంగమంలో పవిత్రస్నానం, ప్రతాపగిరి కోట మెయిన్ దర్వాజా వద్ద మైసమ్మ పూజలు, శనివారం గొంతెమ్మగుట్టపై దేవతల విగ్రహాలకు గోదావరి జలాలతో అభిషేకం, పాండవుల భేరి వద్ద ఆంజనేయ పతాక ఆరోహణం, లక్ష్మీదేవరలు కొలువుదీరడం, అర్ధరాత్రి పెద్దపట్నం వేయడం, లక్ష్మీదేవరల విన్యాసాలు, ఆదివారం లక్ష్మీదేవరలు పెద్ద పట్నం తొక్కే కార్యక్రమా లు, లక్ష్మీదేవరలు, భక్తుల గుట్ట అవరోహణం, నాయక్‌పోడ్ బృందాలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయని నిర్వాహణ కమిటీ సభ్యులు వివరించారు.

కాళేశ్వరాలయంలో కరీంనగర్ ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే గంగులలను ఆశీర్వదిస్తున్న అర్చకులు

మహదేవపూర్, జనవరి 25: మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సమేతంగా గురవాఆరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన అయనకు రాజగోపురం వద్ద అర్చకులు స్వాగతం పలికాకరు. అమ్మవారి ఆలయంలో అభిషేకం నిర్వహించిన అనంతరం అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలను బహూకరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిత్యావసర సరకుల సరఫరాకు టెండర్లు

ఏటూరునాగారం, జనవరి 25 : గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు అవసరమయ్యే 42 రకాల నిత్యావసర సరకుల సరఫరాకు టెండర్లు నిర్వహించనున్నట్లు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఏటూరునాగారం డివిజనల్ మేనేజర్ జి.ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పప్పు ధినుసులు, నూనె, పిండి, పల్లీలు, జీలకర్ర, బూస్ట్, సుగంధ ద్రవ్యాలు, టూత్ పేస్ట్, కొబ్బరి నూనె, ఫేస్ పౌడర్, దువ్వెనలతోపాటు శానిటేషన్ వస్తువులకు టెండర్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు, డిస్ట్రిబ్యూటర్లు తమను సంప్రదించాలని సూచించారు. ఈనెల 30లోగా ఈఎండీ రూ. 2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం 7207982368 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నానరరు.

ఉత్తమ బీఎల్‌వోగా శాంతి

కన్నాయిగూడెం, జనవరి 25 : జిల్లా ఉత్తమ బీఆల్‌వోగా కావిరి శాంతి ఎంపికయ్యారు. మండలంలోని బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధి కొత్తూరు బీఎల్‌వోగా ఆమె విధులు నిర్వర్తిస్తున్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఈ మేరకు శాంతి ఎంపికయ్యారు. ములుగులో గురువారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.

ముగిసిన చిరుతల రామాయణం



చిరుతల రామాయణంలో పట్టాభిషేక ఘట్టం ప్రదర్శన

మహదేవపూర్, జనవరి 25: మండలంలోని కాళేశ్వరం గ్రామంలో ఐదు రోజులుగా నిర్వహించిన చిరుతల రామాయణం బుధవారం రాత్రితో ముగిసింది. బుధవారం రాత్రి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పాత్రధారులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

బొంగు కల్లు అదుర్స్



గోవిందరావుపేట, జనవరి 25: ఇప్పటివరకు వెదురు బొంగుల్లో చికెన్, బిర్యానీలను తయారు చేయడం చూశాం. గిరిజనుల నుంచి మొదలైన ఈ వంటకాలు ప్రస్తుతం నగరాలకు విస్తరించాయి. తాజాగా ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రాజెక్టునగర్ సమీపంలోని తాటివనంలో గీతకార్మికులు బొంగుల ద్వారా కల్లు సేకరించి విక్రయిస్తున్నారు. తాటిచెట్లకు కట్టే లొట్టీల స్థానంలో వెదురుబొంగులను వాడుతున్నారు. అక్కడక్కడా ప్లాస్టిక్ సీసాలు, బిందెలు కట్టడం చూశామని, నేరుగా వెదురు బొంగుల్లో కల్లును సేకరించడం ఇక్కడే చూస్తున్నామని రహదారి వెంట వెళ్లేవారు ఆసక్తిగా చూస్తున్నారు. సాధారణ కల్లు కంటే వెదురు బొంగులోని కల్లు బాగా రుచిగా ఉందని, దీంతో గిరాకీ కూడా పెరుగుతుందని గీతకార్మికులు పేర్కొంటున్నారు.